క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల కోసం కాకినాడ డి9 సెక్షన్ ఇంద్రపాలెం సబ్ స్టేషన్ చీడిగ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. చీడిగ గ్రామంలోని చీడిగ మెయిన్ రోడ్డు, గుడాల వారి సత్రం, గుడాల వారి వీధి, ఆదర్శ నగర్, 60 బిల్డింగ్స్, ఇంద్రపాలెం పరిధిలో పిల్ల కాల్వ రోడ్డు, నేరేళమ్మ కాలనీ, ఇంద్రపాలెం మెయిన్ రోడ్డు, తారకరామ కాలనీ, పల్లపు, మెరక వీధులకు సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

పార్కు ప్రవేశ వేళలు పెంచాలి

కాకినాడ సిటీ: కుళాయి చెరువు పార్కు ఆవరణలోని స్వామి వివేకానంద కాంస్య విగ్రహం వద్ద జవహర్ వీధి గేటు, బాదం వారి వీధిలో కరెంటు కార్యాలయం పక్క గేటును నిర్ణీత వేళల్లో తెరవాలని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆర్డీఓ ఇట్ల కిషోర్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో మూసివేసిన గేటు ఇప్పటి వరకు తెరవకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్కు వేళలను తెల్లవారుజాము 4 నుంచి 8 గంటల వరకు పొడిగించాలన్నారు. పోటీ పరీక్షల కోసం చదువుకునే వారికీ ప్రవేశం కల్పించాలన్నారు. పార్కు బయట ప్లాస్టిక్ గొట్టాలు, సిమెంట్ పలకలు తొలగించి, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

మెగా రిటైల్ ఎక్స్‌పోకు విశేష స్పందన



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న సాయిమనోహర్

బోట్‌క్లబ్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక బోట్‌క్లబ్ ఎదురుగా ఉన్న కృషి భవన్‌లో సోమవారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. బ్యాంకు రీజనల్ హెడ్ సాయిమనోహర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ అన్ని అవసరాలకు అనుగుణంగా అతి తక్కువ వడ్డీకి రుణాలతో పాటు, సేవింగ్స్, కరెంట్ అకౌంటు ఖాతాలు అందిస్తోందన్నారు. అందరూ యూనియన్ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ మెగా ఎక్స్‌పోలో పలువురికి రుణ మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజియన్ హెడ్ నారాయణతో పాటు, ప్రముఖ కార్ డీలర్లు, వ్యాపార వేత్తలు, బిల్డర్లు, ఎడ్యుకేషన్ లోన్ కన్సల్టేషన్ ఏజెన్సీలు, సోలార్ డీలర్లు, అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు .

మొబైల్ రీచార్జ్ భారాన్ని తగ్గించాలని ధర్నా

కాకినాడ సిటీ: మొబైల్ నెట్‌వర్క్ సంస్థలు రీచార్జ్‌ల పేరిట వినియోగదారులపై మోపుతున్న భారాలకు నిరసనగా సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు కె.సత్తిరాజు, పలివెల వీరబాబు మాట్లాడుతూ ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకుని ప్రైవేట్ నెట్‌వర్క్ జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు రీచార్జ్ భారాన్ని 12 నుంచి 25 శాతం పెంచడం దారుణమన్నారు. మరోవైపు బీఎస్ఎన్ఎల్‌కి 4జి, 5జి నెట్‌వర్క్ సేవలు 2023 నవంబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని కేంద్రం చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బకొట్టి, కార్పొరేట్ కంపెనీల సంపద పెంచడమే బీజేపీ దేశ భక్తా అని ప్రశ్నించారు. తక్షణమే జియో, ఎయిర్‌టెల్ పెంచిన రీచార్జ్ భారాన్ని తగ్గించాలని, బీఎస్ఎన్ఎల్‌కు 4జి, 5జి సేవలకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ ఇట్ల కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోతా కృష్ణమూర్తి, నర్ల ఈశ్వరి, రాణి, తలుపులమ్మ, అనపర్తి ఏడుకొండలు, వెంకట్రావు, చిరంజీవి, సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్లాస్టిక్ సర్జరీ డే



సర్జన్ సత్య సుధను సత్కరిస్తున్న డాక్టర్ అడ్డాల తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ ఐడీఏ, అడబాల ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడీఏ రాష్ట్ర సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జన్ ప్రతిభావంతమైన వైద్య విభాగమన్నారు. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సత్య సుధా రాజ్‌కుమార్ మాట్లాడుతూ శరీర ఆకృతి, ముఖ ఆకృతి సక్రమంగా లేనిచోట ప్లాస్టిక్ సర్జరీ ద్వారా కావాల్సిన విధంగా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా పాల్గొన్నారు.

ఆశల జెల్లకి

- ఇప్పటివరకూ ఊసులేని నిరుద్యోగ భృతి. ఇంటికో ఉద్యోగం
- ఎన్నికల మేనిఫెస్టో హామీపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం!
- ఆర్థిక పరిస్థితిని బూచీగా చూపుతుండడంపై అనుమానాలు
- పాలకుల వైఖరిపై మండిపడుతున్న నిరుద్యోగులు

ప్రతి మనిషి మనుగడ జీవనోపాధిపైన ఆధారపడి ఉంది. కుటుంబ పోషణకు వారి ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇంటినీ, ఊరినీ, చివరకు సుదూర దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అధికార అందలం ఎక్కడానికి కొన్ని రాజకీయ పార్టీలు సగటు మనిషి ఎదుర్కొనే ఈ బలహీనతను నిచ్చెనగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి.. తమ ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగుల సమస్య పావుగా మారింది. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగమంటూ ఆశలు రేకెత్తించి, ఓట్లు దండుకున్నాయి. తీరా అధికారంలోకి వచ్చాక వాటి ఊసే మరిచాయి. నిరుద్యోగులను పావులుగా వాడుకుని ఆశల పల్లకీలో ఊరేగించి, ఇప్పుడు ఆర్థిక స్థితిని బూచీగా చూపి, నిరుద్యోగులను నట్టేట ముంచేందుకు సిద్ధమవుతున్నాయి.

బాలాజీచెరువు: రాష్ట్రంలో ఎలాగైనా గద్దెనెక్కాలనే ఉద్దేశంతో ఎన్నికల ముందు చంద్రబాబు అండ్ కో ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారు. అమ్మకు వందనంపై ఇప్పటికీ ప్రకటన చేయకపోగా, కీలక వాగ్దానమైన నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగంపై నోరెత్తడం లేదు. ప్రధానంగా నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తామంటూ నమ్మించి, నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకూ ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని భరోసా ఇచ్చారు. తీరా అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చి నెల రోజులు కావస్తున్నా, ఇప్పటికీ దాని ప్రస్తావన తేవడం లేదు. మెగా డీఎస్సీ పేరిట ప్రకటన చేసి, ఇప్పుడు నిరుద్యోగులను పక్కన పెట్టేశారు. స్మార్ట్ సిటీ అయిన కాకినాడ నగరంలో పదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన వారు మొత్తం 5లక్షల 33వేల 908 మంది ఉన్నారు.

ఇంటికో ఉద్యోగం ఎక్కడ..?

ఎన్నికల ప్రచార సమయంలో కూటమి పార్టీ నేతలు ఇంటికో ఉద్యోగం, అప్పటివరకూ నిరుద్యోగ భృతి ఇస్తామని ఊదరగొట్టారు. నగర వ్యాప్తంగా 6,11,471 గృహాలుండగా, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 16,26,389 గృహాలు ఉన్నాయి. ఈ లెక్కన చూసినా ఆయా నియోజకవర్గాల్లో లక్షలాది ఉద్యోగాలను ప్రభుత్వం చూపించాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేదంటూ అడపాదడపా పాలకులు చేస్తున్న ప్రకటనలపై నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను క్రమంగా ప్రజల నుంచి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా అంటూ చర్చించుకుంటున్నారు.

కోచింగ్ సెంటర్లకు రూ.లక్షల్లో ఫీజులు

ప్రభుత్వ కొలువుల కోసం యువత శిక్షణ తీసుకునేందుకు రూ.లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. షార్ట్‌టెర్మ్, లాంగ్‌టెర్మ్ శిక్షణకు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకూ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల నోటిఫికేషన్లకు నగరంతో పాటు, రూరల్ ప్రాంతంలో ప్రధానంగా 8 శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒకొక్క కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మంది శిక్షణ పొందుతున్నారు. వీటితో పాటు చిన్న శిక్షణ కేంద్రాలు మరో 20 వరకూ ఉన్నాయి. వీటిలో ఒకొక్క దాంట్లో 200 మంది వరకూ శిక్షణ పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

వయో పరిమితిపై ఆందోళన

నిరుద్యోగ భృతి అమలుకు 22 నుంచి 35 ఏళ్లు మాత్రమే అని ప్రకటించడంతో వయో పరిమితి మేరకు చాలా మంది అనర్హులుగా మిగిలిపోతామని ఆందోళన చెందుతున్నారు. 22 ఏళ్లలోపు వారు ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలకు శిక్షణ పొందుతారు. వీరికి నిరుద్యోగ భృతి రాకపోతే నూటికి 30 శాతం మంది అనర్హులుగా ఉండిపోయే అవకాశాలున్నాయి.



ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు



నిరుద్యోగ భృతి చెల్లించాలి



బీకామ్ డిగ్రీ చదివి ఖాళీగా ఉంటున్నాను. అధికారంలోకి రాగానే ఉద్యోగాలు వచ్చేలా చేస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలపై కానీ, నిరుద్యోగ భృతిపై కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి. నిరుద్యోగ భృతి చెల్లిస్తే తల్లిదండ్రులపై ఆధారపడకుండా, ఆ సొమ్ముతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడానికి ఉపయోగపడుతుంది.

– మార్నెళ్ల సిద్ధార్థ, నిరుద్యోగి, యండమూరు, కరప మండలం

వయో పరిమితి పెంచాలి



నిరుద్యోగ భృతిపై వయో పరిమితి పెంచాలి. కనీసం 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల వయస్సు నిర్ధారించి, ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి అందజేయాలి. గతంలో చేసిన విధంగా అరకొరగా అమలు చేయకుండా, వంద శాతం నిరుద్యోగులను ఆదుకోవాలి. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతను దృష్టిలో ఉంచుకుని త్వరగా అమలు చేయాలని కోరతున్నాం. కూటమి ప్రభుత్వం తాత్సారం చేయకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– పి.రవితేజ, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్

నమ్మి ఓటు వేశాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగమైనా ఇవ్వాలి లేని పక్షంలో నిరుద్యోగ భృతి వెంటనే విడుదల చేయాలి. నిరుద్యోగ భృతి ఇస్తామంటే నమ్మి ఓటు వేశాం. 87 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత సాధించాను. నాటి నుంచి పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లకు వెళుతూ సిద్ధమవుతున్నాను. గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఉద్యోగ ప్రకటనలు పడుతుండటంతో భవిష్యత్తుపై ఆశ కలిగింది. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి హామీ ఇవ్వకపోగా, నిరుద్యోగుల ఆలోచనలను మళ్లించేందుకు భృతి ఇస్తామని చెప్పింది. నెల అయినా ఏమీ స్పష్టత ఇవ్వలేకపోయింది.

– నాగం దొరబాబు, నిరుద్యోగి, కాకినాడ

పేదరికంలో నిరుద్యోగులు



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చి నిరుద్యోగులను ఆదుకునేందుకు తక్షణం నిరుద్యోగ భృతి అమలు చేయాలి. చాలా మంది నిరుద్యోగులు పేదరికంలో ఉన్నారు, ప్రభుత్వం ఇచ్చే భృతి వారికి, వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. కూటమి పార్టీలు మేనిఫెస్టో ప్రకారం హామీలు అమలు చేస్తేనే ప్రజలు హర్షిస్తారు. నిరుద్యోగులు తమకు ప్రభుత్వం అందించనున్న నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

– తోటకూర శ్రీనివాస్, ఉప సర్పంచ్, కొవ్వాడ

ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం

అధికారులకు కమిషనర్ ఆదేశం

కాకినాడ: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు అధికారుల ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. ప్రజల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన వినతులను కమిషనర్ స్వీకరించారు. పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఉద్యాన విభాగాలకు సంబంధించి 20 మంది తమ సమస్యలను ఫోన్ ద్వారా విన్నవించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని కమిషనర్ కొనసాగించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి 16 మంది నేరుగా వచ్చి, పలు సమస్యలపై కమిషనర్‌కు వినతులు అందజేశారు. వీధి దీపాలు, స్పీడ్ బ్రేకర్లు, పార్కుల్లో లైట్లు వేయాలని, అసంపూర్తి రహదారులను పూర్తి చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అక్కడున్న అధికారులను ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే ప్రతి ఒక్క సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రతి సోమవారం సమస్యలను తెలియజేయవచ్చని ప్రజలకు సూచించారు. సమస్యలన్నింటిపై ప్రతి శుక్రవారం అధికారులతో సమీక్షిస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాతిపతులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటరావు

సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సర్పవరం జంక్షన్‌లో స్వాతంత్ర సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సంఘ ప్రతినిధులు చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ రాజకీయ వేత్తగా, విద్యావంతురాలిగా, స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణకు దుర్గాబాయి ఎన్నో సేవలందించారన్నారు. 1909 జూలై 15న రాజమండ్రిలో జన్మించారని, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, వివాహ చట్టాలతో మహిళలకు రక్షణ తదితర వాటికి కృషి చేశారని కొనియాడారు. భారత ప్రభుత్వం 1975లో పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించిందన్నారు.



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సూర్య కళా మందిరంలో నిర్వహించిన నాటిక పోటీల్లో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి రాత నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ చైతన్య భారతి వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కత్రిపాడు వారి విముక్తి నాటిక, ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా గుంటూరు ఆరాధన ఆర్ట్స్ వారి క్షేత్రం నాటిక ఎంపికయ్యాయి. ఉత్తమ బాల నటనకు సురభి వాగ్దేవి(రాత), ఉత్తమ నటుడిగా జీవీ మనోహర్(క్షేత్రం), ద్వితీయ ఉత్తమ నటుడిగా పి.ముత్యాలరావు(మలిసంధ్య), ఉత్తమ నటిగా జ్యోతిరాజ్(మూల్యం), ద్వితీయ ఉత్తమ నటిగా జ్యోతిరాజీ(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ రచనగా రచయిత సింహప్రసాద్(మూల్యం), ఉత్తమ దర్శకునిగా శ్రీనివాసరావు(రాత), ఉత్తమ విలక్షణ నటనకు వి.నాంచారయ్య, ఉత్తమ సహాయ నటిగా గుడివాడ లహరి(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ సహాయ నటుడిగా ఎ.రామ్‌తేజ్(విముక్తి), ఉత్తమ హాస్య నటుడిగా శ్రీపూర్ణా సత్యం(క్షేత్రం), ఉత్తమ ప్రతి నాయకుడిగా ఎస్ వేంకటేశ్వరరావు(విముక్తి), ఉత్తమ సంగీతానికి నాగరాజు(స్వప్నం రాల్చిన అమృతం), ఉత్తమ ఆహార్యానికి సింగూరు రమణారావు(అ సరసాల), ఉత్తమ రంగాలంకరణకు శ్రీరాము(నాలోన నీవే), ఉత్తమ రంగోద్దీపనకు సురభి ఉమాశంకర్(రాత), జ్యూరీ బహుమతి బి.నాగరాణి(విముక్తి), కరణం సరిత(నాలోనే నీవే) కైవసం చేసుకున్నారు. వీరికి బహుమతులు, నగదు పురస్కారాలను సంస్థ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు సోమవారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం, రంపచోడవరానికి చెందిన కేతమాల సూర్య చంద్ర మోటార్ సైకిల్‌పై వడిశలేరు నుంచి కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని అత్తవారింటికి వెళుతున్నాడు. మండలంలోని నీలాద్రిరావుపేట వద్దకు వచ్చేసరికి సిమెంట్ బస్తాలతో జగ్గంపేట వైపు నుంచి వస్తున్న లోడు ఆటో ఆకస్మికంగా మలుపు తిరగడంతో, బైక్ అదుపుతప్పి ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో సూర్యచంద్ర ఎడమ కాలికి తీవ్రగాయమైంది. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది సతీష్, రాంబాబు క్షతగాత్రునికి తక్షణ సహాయక చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి రోడ్డు సేఫ్టీ అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది

గృహ నిర్మాణాలకు ముందుకు రండి

లబ్ధిదారులకు కమిషనర్ సూచన

కాకినాడ: కొమరగిరి లేఅవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన తమ వాటా సొమ్మును త్వరగా సమకూర్చుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. కాకినాడలోని 4,5,6 డివిజన్ల గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసే అంశంపై సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ లేబర్ ఏజెన్సీ ద్వారా గృహ నిర్మాణాలకు రూ.3 లక్షల నుంచి రూ.3.20 లక్షల వరకు ఖర్చవుతుందని గతంలో అంచనా వేశారన్నారు. ఇందులో రూ.1.80 లక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయని, మిగిలిన సొమ్మును లబ్ధిదారుల వాటాగా సిద్ధం చేసుకోవాలన్నారు. సొమ్ము సిద్ధం చేస్తే గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. హౌసింగ్ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ కె.సత్యనారాయణ రెడ్డి, ఆయా డివిజన్ల స్పెషల్ ఆఫీసర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కారుణ్య నియామకాలు

నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సోమవారం ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్ మూర్తి మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తూ మరణించిన సత్యనారాయణ స్థానంలో ఆయన భార్య దుర్గాదేవికి నగరపాలక సంస్థ సాధారణ విభాగంలో పనిచేసేలా ఉత్తర్వులు అందజేశారు. ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ మృతి చెందిన తాతబ్బాయి స్థానంలో ఆయన సతీమణి సంగంరెడ్డి భవానికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

బుద్ధాకు మ్యాజిక్ స్టార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బుద్ధా శ్రీనివాస్

పెద్దాపురం: పట్టణానికి చెందిన జాతీయ స్థాయి సైంటిఫిక్ మెజీషియన్ బుద్ధా శ్రీనివాస్‌కు డాక్టర్ బోస్ మ్యాజిక్ స్టార్ అవార్డు లభించింది. ఈ మేరకు ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మ్యాజిక్ రంగంలో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథం, అవగాహన పెంపొందించేలా దేశవ్యాప్తంగా అనేక ప్రదర్శనలు ఇచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు. సంఘ అధ్యక్షుడు కేవీఆర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్యల్ ప్రసాద్, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత స్టిక్ మనోహర్ చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఆయనను పట్టణ ప్రముఖులు, ప్రజా సంఘాల వారు అభినందించారు.

టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

జగ్గంపేట: నియోజకవర్గంలోని టెట్, డీఎస్సీ అభ్యర్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ, కాపు కల్యాణ మండపం, స్టేడియంలోని ఏదో ఒకచోట శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజనం, తేనీరు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల 17వ తేదీ నుంచి శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పట్టణానికి చెందిన వైద్యుడు ఎస్.విజయబాబు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో కాలుష్యం నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం, చెట్లు నరకడం వంటివి పెరిగిపోయాయని, వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళిక రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీనికి పట్టణంలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

సంకల్ప్ సేవలు అభినందనీయం

బోట్‌క్లబ్: చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ సంకల్ప్ సేవలు ప్రశంసనీయమని క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక విద్యాంజలి స్కూల్, లయన్స్ క్లబ్ సంకల్ప్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం, పేపర్ బ్యాగ్ తయారు చేయడం, చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సంకల్ప్ అధ్యక్షురాలు ఎస్ లావణ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దంత వైద్యులు జుబేదా, రేఖా, రమ్య, ప్రియాంక, నూరానీ పాల్గొని, సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, పేస్టులను అందించారు. అనంతరం చిన్నారులకు పేపర్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం గైనకాలజిస్ట్ రమ్య చిన్నారుల్లో కేన్సర్‌పై అవగాహన కల్పించారు. రోటరీ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, స్కూల్ కరస్పాండెంట్ సంధ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బాదం బాలకృష్ణ

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

- జేసీ రామసుందర్ రెడ్డి
- పరిష్కార వేదికకు 274 అర్జీలు

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. పెద్దాపురం రాజుగారి వీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆర్డీఓ జేఎస్ రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. అర్జీలపై ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. భూమి ఆన్‌లైన్ నమోదు, సర్వే, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాలు, బీమా, సదరం సర్టిఫికెట్లు, ఏలేరు దబ్బ కాలువ బ్రిడ్జి నిర్మాణం, మురికి కాలువ పూడికతీత, పారిశుధ్యం, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, గంజాయి రవాణా, శ్మశాన వాటిక స్థలం మంజూరు, జనావాసాల్లో పాముల బెడద, వీధి కుక్కల స్వైర విహారం తదితర సమస్యలపై 274 అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సరిత, డీఎల్పీఓ బాలామణి, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఎంపీడీఓ ఎం.ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దబ్బ కాలువ నిర్మాణంపై జేసీకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలి

ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్‌లో స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లపై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని పీహెచ్‌సీల డాక్టర్లు అనూపారాయ్, నిహారిక, అనూష, న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎన్‌జీఓ సభ్యులు వాసవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు